# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **డిజిటల్ ఇండియా కార్యక్రమం డిజిటల్ సాధికారతకు దోహదపడిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తూర్పుగోదావరి జిల్లాలో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.**
3. **ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో వైద్యులు కీలకపాత్ర పోషిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు.**
4. **రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**
5. **బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ ఎన్నికైనట్లు ఆ పార్టీ ఈరోజు ప్రకటించింది.**

==========================

డిజిటల్ ఇండియా కార్యక్రమం ఈరోజుతో 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దేశాన్ని డిజిటల్ సాధికారత కలిగిన ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో 2015 జూలై 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని స్పందిస్తూ "ఈ రోజు ఒక చారిత్రాత్మక దినమని అన్నారు. పదేళ్ల క్రితం, దేశాన్ని డిజిటల్‌గా సాధికారత పొందిన, సమాజంగా మార్చడానికి డిజిటల్ ఇండియా ప్రారంభమైందన్నారు. భారతీయుల సంకల్పంతో దేశం డిజిటల్ చెల్లింపుల్లో గణనీయమైన పురోగతిని సాధించిందని తెలిపారు.

--------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు తూర్పుగోదావరి జిల్లాలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా తాళ్లపూడి మండలంలోని మలకపల్లి గ్రామంలో "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పించన్ల నగదును పంపిణీ చేస్తారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగిస్తారు. తూర్పుగోదావరి పర్యటన ముగించుకున్న అనంతరం ముఖ్యమంత్రి ఈ రోజు సాయంత్రం చిత్తూరు జిల్లా కుప్పం చేరుకుంటారు. శాంతి పురం మండలం తిమ్మ రాజు పల్లె గ్రామంలో ప్రభుత్వం రేపు ప్రారంభించే ఇంటింటి పర్యటనలో పాల్గొంటారు. అనంతరం శాంతి పురం మండలం తుమ్మిసి లో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.

కాగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఈరోజు కొనసాగుతోంది. శ్రీకాకుళం, నెల్లూరు, ఒంగోలులో రాష్ట్ర మంత్రులు కె. అచ్చెన్నాయుడు, పి.నారాయణ, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి లబ్ధిదారులకు నగదు అందజేశారు. అలాగే పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అనంతపురం జిల్లాలలో అధికారులు, శాసనసభ్యులు సచివాలయ ఉద్యోగులతో కలిసి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా అనంతపురం శాసనసభ్యులు డి. వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ..

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

ఈ రోజు జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడడానికి వైద్యులు చేస్తున్న కృషిని గుర్తించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ప్రముఖ వైద్యులు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, భారత రత్న డాక్టర్ బీదాన్ చంద్రరాయ్ జయంతి, వర్ధంతి కూడా అయిన జులై 1వ తేదీన ప్రతి ఏటా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

---------------------------

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో వైద్యులు కీలకపాత్ర పోషిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ వైద్యులకు పురస్కారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

..వాయిస్..34 సెకన్లు

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆ పార్టీ యువజన విభాగం ప్రతినిధులతో ఈరోజు సమావేశం అయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో యువత ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి అంశాలపై చర్చిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, శాసన సభ నియోజకవర్గాల అధ్యక్షులు పాల్గొన్నారు.

---------------------------

రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ఆయన ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్ ..21 సెకన్లు

---------------------------

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ ను ఆ పార్టీ ఎన్నికల పరిశీలకులు, కర్ణాటక పార్లమెంట్ సభ్యులు పీసీ మోహన్ ఈరోజు ప్రకటించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మాధవ్ కు రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ ధృవపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా

నూతన అధ్యక్షుడికి పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 58 వేల 750 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం ఈరోజు ఉదయానికి 874.30 అడుగులు ఉండగా.., నీటి నిల్వ 160.52 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

---------------------------

వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రాజెక్టుల పనులపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సొరంగాలలో లైనింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని మంత్రి సూచించారు.

---------------------------

గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న పొరుగు సేవల ఉద్యోగుల వేతనాలను త్వరలో పెంచనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 7 వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 వేల కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చనున్నట్లు  పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు మెరుగువుతాయని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని క్రీడా ప్రాధికార సంస్థ- శాప్ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ బాలుర కళాశాల సముదాయంలో ఇండోర్ క్రీడా మైదాన నిర్మాణ పనులను చంద్రగిరి శాసన సభ్యులతో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మాట్లాడుతూ.. గతంలో ఆగిపోయిన పనులను  కోటి 53లక్షల రూపాయలతో పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

====================